హైదరాబాద్ వార్త



## సమతామూర్తి

# చిట్‌ఫండ్ నిర్వాహకులు అరెస్ట్

**ఇప్పటి వరకు 5కోట్ల మోసం**

**జరిగినట్లు గుర్తింపు: మాదాపూర్ డిసిపి వినీత్**



వివరాలు వెల్లడిస్తున్న మాదాపూర్ డిసిపి వినీత్

గచ్చిబౌలి, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త : చిట్‌ఫండ్ పేరుతో పేద,మధ్య తరగతి ప్రజల వద్ద నుంచి కోట్ల రూపాయలు కొల్లగొట్టిన సమతామూర్తి చిట్‌ఫండ్ నిర్వాహకులు ఇద్దరిని అరెస్టు చేసినట్లు మాదాపూర్ డిసిపి వినీత్ తెలిపారు. మొత్తం 120మంది బాధితులు వెలుగులోకి వచ్చారని, దాదాపు 5కోట్ల రూపాయలను బాధితుల వద్ద నుంచి చిట్టీల పేరుతో వసూలు చేసినట్లు గుర్తించామని అన్నారు. ఈమేరకు బుధవారం మాదాపూర్ డిసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిసిపి వినీత్ కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. మంచిర్యాల జిల్లా నుంచి వచ్చి నగరంలోని ఉప్పల్‌లో స్థిరపడిన ఏల్పుల శ్రీనివాస్(47), అతనికి వరుసకు కుమారుడయ్యే ఏల్పుల రాకేష్‌వర్మ(27), ఎల్‌బినగర్‌కు చెందిన గణేష్‌లు మాదాపూర్‌లో ఆరునెలల క్రితం సమతామూర్తి చిట్‌ఫండ్ పేరుతో చిట్‌ఫండ్ సంస్థను ఏర్పాటు చేశారు. ఈ సంస్థకు ఎటువంటి ఆధికారిక గుర్తింపు లేకపోగా, మాదాపూర్‌తో పాటు ఎల్‌బినగర్, కూకట్‌పల్లిలోనూ బ్రాంచ్‌లను తెరిచారు. ఆన్‌లైన్ వేదికగా ప్రచారం చేసుకోవడం, పలువురు ఉద్యోగులను నియమించుకొని ప్రచారం చేయడంతో పేద, మధ్య తరగతి ప్రజలు భారీ ఎత్తున ఈ చిట్‌ఫండ్ సంస్థలో నెలవారి చిట్టీలు కట్టారు. సంస్థ ఆధ్వర్యంలో 5లక్షల నుంచి 1కోటి రూపాయల వరకు చిట్టీలు ఉండడంతో నెలవారి ఉద్యోగులు, సాఫ్ట్‌వేర్ సంస్థల ఉద్యోగులు, గ ృహిణులు చిట్టీలు కట్టిన వారిలో ఉన్నారు. ఒక్కొక్కరు నెలకు 3వేల నుంచి 50వేల వరకు చిట్టీ డబ్బులు కట్టారు. కాగా కొన్ని నెలలుగా చిట్టీలు ఎత్తుకున్న వారికి చిట్‌ఫండ్ సంస్థ చెక్కులను ఇవ్వగా, బ్యాంకు ఖాతాలో డబ్బు లేకపోవడంతో చెక్‌లు బౌన్స్ అయ్యాయి. దీంతో బాధితులు మోసపోయినట్లు గుర్తించి గతనెల 13వ తేదీన మాదాపూర్ పోలీసులకు పిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టగా, రెండు రోజుల క్రితం బాధితులు సైబరాబాద్ కమీషనర్ అవినాష్ మహంతిని కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. కమీషనర్ ఆదేశాలతో చిట్‌ఫండ్ నిర్వాహకులు శ్రీనివాస్, రాకేష్‌వర్మలను అరెస్టు చేసిన పోలీసులు వారి వద్ద నుంచి 3సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కాగా సమతామూర్తి చిట్‌ఫండ్ బాధితులు ఇప్పటి వరకు 120మంది వెలుగులోకి వచ్చారని, బాధితుల నుంచి నిర్వాహకులు దాదాపు 5కోట్ల రూపాయలను వసూలు చేసినట్లు గుర్తించామని డిసిపి తెలిపారు. మరో నిర్వాహకుడు గణేష్ పరారీలో ఉన్నాడని తెలిపారు. సమావేశంలో అడిషనల్ డిసిపి నంద్యాల నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



3లో

వివిఎన్‌ఆర్ విజెఐఈటిలో ఐపిఎల్ ఆన్ స్టార్ ప్రోమోలో పాల్గొన్న ఇండియన్ క్రికెట్ టీమ్ మాజీ ఆటగాళ్లు ఇర్ఫాన్ పఠాన్, పక్కన ఎమ్మెల్యే ప్రసాద్

## పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి: ఎబివిపి



3లో

ధర్నా చేస్తున్న ఏబీవీపీ విద్యార్థి నాయకులు

పెండింగ్‌లో ఉన్న 5వేల300 కోట్ల ఫీజు రీయింబర్‌మెంట్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ కూకట్‌పల్లి విభాగం ఆధ్వర్యంలో సికింద్రాబాద్ క్లాక్‌టవర్ వద్ద బేగంపేట్, ప్యారడైజ్ టౌన్ విద్యార్థులు మహాధర్నా చేశారు.

# అవినీతి ఇక్కడ.. ఎసిబి ఎక్కడ?

## అక్రమార్జనకు నిలయంగా మేడ్చల్ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

అవినీతిలో ఆరితేరిన కొందరు ఎంత తెలివిగా వ్యవహరిస్తున్నారంటే తమ తప్పులు, వసూళ్ళు బయటపడకుండా ఉండేందుకు డాక్యుమెంట్ రైటర్లు, బ్రోకర్లతో వసూలు చేయిస్తున్నారు. మామూళ్ళ కోసం అధికారులు ప్రజల్ని పీడిస్తూ అనేక అక్రమాలకు పాల్పడుతున్నప్పటికీ అవినీతి నిరోధక శాఖతోపాటు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ కమిషనర్ ఐజి కార్యాలయం పట్టించకోకపోవడంలో అంతర్యమేమిటోనని పలువురు ప్రశ్నిస్తున్నారు.

**కరప్షన్ కింగ్‌ల వసూళ్ళు రూ.కోట్లలో**



కూకట్‌పల్లి జోన్ ప్రతినిధి, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త: మేడ్చల్ జిల్లా రిజిస్ట్రార్(డీఆర్) కార్యాలయం అవినీతి, అక్రమార్జనకు నిలయంగా మారింది. ఈ కార్యాలయంలో కీలక బాధ్యతల్ని నిర్వహిస్తోన్న ఓ అధికారి కరప్షన్ కింగ్‌లా మారారు. ఏ పనికైనా డబ్బులు ఇవ్వనిదే ఈ కార్యాలయంలో ఫైళ్ళు ముందుకు కదలడం లేదు. లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టి ఇక్కడ పోస్టింగ్ దక్కించుకున్న ఓ కీలక అధికారి వడ్డీతో సహా రాబట్టేందుకు అడ్డదారులు తొక్కుతున్నాడు. ముడుపులు ఇవ్వని వారిని వారాలు, నెలల తరబడి తమ చుట్టూ తిప్పుకుంటున్నారు. డాక్యుమెంట్ రైటర్లతోపాటు బ్రోకర్లతో వసూళ్ళ దందాకు పాల్పడుతున్నారు. ఇదిలా ఉండగా.. జాయింట్ 1 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్‌కు వచ్చే వారి నుంచి బేరసారాలకు దిగడం విస్మయానికి గురిచేస్తుంది. జాయింట్ సబ్‌రిజిస్ట్రార్1 కార్యాలయంలో బాధ్యతల్ని నిర్వహిస్తోన్న ఓ అధికారి కార్యాలయాన్ని అవినీతికి అడ్డాగా మార్చి, మధ్యవర్తులు, డాక్యుమెంట్ రైటర్లతో అక్రమ వసూళ్ళ దందాకు దిగడం విస్మయానికి గురిచేస్తుంది. ప్రతి లావా దేవీల వెనుకాల ఖచ్చితమైన రేట్లు అమలులో ఉన్నాయి. చిన్న పని నుంచి పెద్ద పనిదాకా ఏ పనికైనా ఓ రేటు నిర్ణయించి మరీ జలగల్లా లంచాల కోసం పీడిస్తున్నారు. ఇళ్ళు కొన్నప్పుడు మాకు కూడా మామూళ్ళు ఇవ్వాల్సిందేనని కొందరు మరీ డిమాండ్ చేసి అమ్యామ్యాలు దండుకుంటున్నారు. ఎవరైనా నేరుగా డాక్యుమెంట్ రైటర్లు, మధ్యవర్తులు, దళారులు లేకుండా కార్యాలయానికి వెళితే వారి అవస్థలు అన్నీ ఇన్నీ కావని చెప్పవచ్చు. ఎంత చదువుకున్న వారైనా రిజిస్ట్రేషన్‌కు సంబంధించి సొంతంగా డాక్యుమెంట్ రాసుకోరు. భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందులు రాకుండా సరైన పదాలు, మెలికలు, కిటుకులు డాక్యుమెంట్ రైటర్‌లకు తెలిసినంతగా ఇతరులకు తెలియదు. దీంతో రిజిస్ట్రేషన్‌కి వచ్చే వారు వీరిని ఆశ్రయించక తప్పని పరిస్థితి వినియోగదారులది. రిజిస్ట్రేషన్లకు సంబంధించి ఒక్కో పనికి ఒక్కో రేట్ కట్టి కొందరు తమ అవినీతి దందా కొనసాగిస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు.

**ఆదేశాల్ని పట్టించుకోవడం లేదు**

రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయానికి వచ్చే వారిని ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు వ్యవహరించాలని ఓ వైపు ఉన్నతాధికారులు ఇస్తున్న ఆదేశాల్ని ఈ కార్యాలయంలో ఎవరూ పట్టించుకోవడం లేదు. గతంలో స్టాంప్స్ వెండర్స్, డాక్యుమెంట్ రైటర్లు తక్కువ సంఖ్యలో ఉండేవారు ఇదొక లాభసాటి వ్యాపా రంగా మారడంతో దీనికి పోటీ ఎక్కువై అధికారులకు కోరని వరంగా మారి లక్షలాది రూపాయలు వీరి ద్వారా అధికారుల జేబుల్లో పడుతున్నాయి. డబ్బులు చెల్లించని వారి డాక్యుమెంట్లను చేయకుండా ఏవో మెలికలు పెడుతూ ఇబ్బందులకు గురిచేస్తుండడంతో చేసేది ఏమిలేక అధికారులు కోరిన లంచాలను ఇచ్చి తమ పనులను చేసుకుంటున్నారు.

**అవినీతి ఇక్కడ.. నిరోధక శాఖ ఎక్కడ..**
**అక్రమార్కుల ఆదాయం రూ.కోట్లలో**

జిల్లా రిజి స్ట్రార్ (డీఆర్) కార్యాలయంలో కీలక బాధ్యతల్ని నిర్వహిస్తోన్న ఓ అధికారి జిల్లాలోని పలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సబ్ రిజిస్ట్రార్లతో వసూళ్ళకు పాల్పడుతున్నట్లు, మామూళ్ళు ఇవ్వని అధికారులను వేదింపులకు గురిచేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కుత్బుల్లాపూర్, ఘట్కేసర్, ఉప్పల్, మేడ్చల్ జాయింట్ సబ్ రిజిస్ట్రార్1 కార్యాలయాలు అవినీతి, అక్రమార్జనలో రికార్డు సృష్టిస్తున్నాయి. అక్రమ వసూళ్ళకు పాల్పడుతూ రూ.కోట్ల ఆదాయాన్ని పోగేసుకుంటున్న అక్రమార్కులపై అవినీతి నిరోధక శాఖ దృష్టిసారించడంలేదు. ఇక్కడ జరుగుతున్న అక్రమాలపై ఏసీబీ దృష్టిసారిస్తే అధికారుల అవినీతి భండారం బయటపడుతుందని పలువురు పేర్కొంటున్నారు. వివిధ రిజిస్ట్రేషన్లకు సంబంధించి బ్రోకర్లు, ద్వారా వసూలు చేస్తున్న మామూళ్ళు నిత్యం లక్షలు ఒక నెలలో రూ.కోట్ల వరకు అక్రమ ఆదాయం వస్తున్నట్లు తెలిసింది. ఇలా వచ్చిన అక్రమ ఆదాయాన్ని పై నుంచి కిందిస్థాయి అధికారులు, వాటాలుగా పంచుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. రిజిస్ట్రేషన్ చేసుకున్న ఆస్తి విలువను బట్టి లంచాల డిమాండ్ ఈ కార్యాలయాల్లో ఉంది.

ఇంత భారీ మొత్తంలో మామూళ్ళను ఇవ్వలేమని కొంత తగ్గించాలని అడిగితే తమ సీటు కాపాడుకోవాలంటే స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ప్రధాన కార్యాలయాల్లో కొందరు అధికారులకు ఇవ్వాల్సి ఉంటుందని చెప్పి కొందరు అధికారులు పేర్కొంటూ తమ అక్రమ దందా కొనసాగి స్తున్నట్లు ప్రజలు వాపోతున్నారు. అవినీతిలో ఆరితేరిన కొందరు ఎంత తెలివిగా వ్యవహరిస్తున్నారంటే తమ తప్పులు, వసూళ్ళు బయటపడకుండా ఉండేందుకు డాక్యుమెంట్ రైటర్లు, బ్రోకర్లతో వసూలు చేయిస్తున్నారు. మామూళ్ళ కోసం అధికారులు ప్రజల్ని పీడిస్తూ అనేక అక్రమాలకు పాల్పడుతున్నప్పటికీ అవినీతి నిరోధక శాఖతోపాటు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ కమిషనర్ ఐజి కార్యాల యం పట్టించకోకపోవడంలో అంతర్యమేమిటోనని పలువురు ప్రశ్నిస్తున్నారు.

## నిలోఫర్ ఆసుప్రతిలో అగ్ని ప్రమాదం

**పొగతో నిండిపోయిన ఆసుపత్రి పరిసరాలు**

మెహిదీపట్నం, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త : నిలోఫర్ ఆసుపత్రిలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఆసుపత్రిలోని రెండవ అంతస్తులో ల్యాబ్‌ను నిర్వహిస్తుండగా, ల్యాబ్ అవసరాల కోసం ఏర్పాటు చేసిన ఫ్రీజ్ వైర్ షాక్ సర్క్యూట్ కావడంతో ల్యాబ్‌లో దట్టమైన పొగలు అలుముకున్నాయి. పొగ బయటకు రావడంతో దానిని గమనించిన ఆసుపత్రిలోని రోగుల తల్లిదండ్రులు, బయటి వ్యక్తులు ఒక్కసారిగా ఆందోళనకు గురైనారు. సెక్యూరిటీ సిబ్బంది డాక్టర్లకు సమాచారం అందించడంతో పాటు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మొదటి అంతస్థులోకి వెళ్లి పరిశీలించగా ఎలాటి మంటలు రాలేదని, షాక్ సర్క్యూట్‌తో వైర్ కాలడం వలనే పొగలు వచ్చాయని తెలిపారు. దీంతో ఆసుపత్రిలోని రోగులు, డాక్టర్లు ఊపిరిపీల్చుకున్నారు. కాగా విషయం తెలుసుకున్న నాంపల్లి ఎమ్మెల్యే మహమ్మద్ మాజిద్ హుసేన్ ఆసుపత్రికి చేరుకొని పొగ ఎలా వచ్చిందని డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. నిలోఫర్ ఆసుపత్రిలోని రెండవ అంతస్థు ల్యాబ్‌లోని ఫ్రీజ్ వైర్ కాలడంతో పొగ వ్యాపించింది. పొగ బయటకు రావడంతో రోగుల తల్లిదండ్రులు, బయటి వ్యక్తులు ఆందోళనకు గురైనారు. రెండవ అంతస్థులో చిన్నపిల్లల వ్యార్డు లేకపోవడంతో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. విషయం తెలవగానే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించాం.

## డ్రైనేజీ పైప్‌లైన్ పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే కాలేరు



నల్లకుంటలో డ్రైనేజీ పైప్‌లైన్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే, కార్పోరేటర్

హైదరాబాద్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త: నల్లకుంటలో 13 లక్షలతో నిర్మిచనున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, స్థానిక కార్పోరేటర్ యాకర అమృత కలిసి బుధవారం శంకుస్థాపన చేశానరే. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలతోపాటు సంబంధిత అధికారులు, మాజీ కార్పోరేటర్ వనం రమేష్, డివిజన్ అధ్యక్షుడు మెడి ప్రసాద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ సమస్యలపై జోనల్ కమిషనర్ సమావేశం




సమావేశంలో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్

కూకట్‌పల్లి జోన్ ప్రతినిధి, ఫిబ్రవరి 7ప్రభాతవార్త: ట్రాఫిక్ సమస్యల నివారణకుగాను కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో కమిషనర్ అభిలాష అభినవ్ ట్రాఫిక్ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదు సర్కిళ్ళలోని ఆయా ప్రాంతాల్లో విస్తరణ చేయాల్సిన రోడ్లు, ఫ్రీలెఫ్ట్‌ల విస్తరణ, జంక్షన్ల అభివృద్ధి గురించి ట్రాఫిక్ అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి జోనల్ ఎస్‌ఈ చిన్నారెడ్డి, ట్రాఫిక్ అదనపు డీసీపీ వేణుగోపాల్‌రెడ్డి, ఏసీపీలు పాల్గొన్నారు.

# తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

## డబుల్ బెడ్‌రూంలపై త్వరలోనే ప్రభుత్వం పరంగా పాలసీ ప్రకటన: మంత్రి పొన్నం



సమీక్షా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్, కమిషనర్ రోనాల్డ్‌రోస్, మేయర్ విజయలక్ష్మీ, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త: మహానగరంలో ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నామని జిల్లా ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈమేరకు బుధవారం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో కమిషనర్ రోనాల్డ్ రోస్, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ, డిప్యూటీ మేయర్ శ్రీలత, జోనల్ కమిషనర్లు, అధికారులతో కలిసి హైదరాబద్ నగర అభివృద్ధి, సమస్యలపై తొలిసారిగా సమీక్షించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిహెచ్ఎంసి అభివృద్ధిపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని వచ్చే సమ్మర్‌లో నీటి ఎద్దడికి ఎలాంటి సమస్యల లేదని త్రాగునీటటి సమస్యల లేకుండా అన్ని ముందస్తు ఏర్పాట్లు చేశామన్నారు. జిహెచ్ఎంసిలో రెవెన్యూ పెంచుకోవడానికి ప్రత్యేక పాలసీతో ముందు వెళ్లబోతున్నామని మూసి అభివృద్ధికి ఎలాంటి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే అర్బన్ అభివృద్ధికోసం కేంద్ర సహకారం తీసుకునే ఆలోచనలో తమ ప్రభుత్వం ఉందని అందుకే అభివృద్ధి విషయంలో ఎలాంటి బేషజాలకు పోకుండా కేంద్రాన్ని కలుపుకుని పోతామన్నారు. హైదరాబాద్ అభివృద్ధిపై రోజువారీగా సమీక్షలు ఉంటాయన్న మంత్రి ..సమస్యలలపై రిపోర్టు తయారు ఉంటుందని జిహెచ్ఎంసి పరిధిలోని అధికారులు అలెర్టుగా ఉండాలని అప్పులు - ఆస్తుల అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి నివేదిక చేసి ఇవ్వనున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వం తరహాలో హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు నిధుల కేటాయింపు ఉంటుందని తెలిపారు. అలాగే డబుల్‌బెడ్‌రూంలపై త్వరలోనే ప్రభుత్వం పాలసీప్రకటన చేస్తుందని పేర్కొన్నారు.

## ప్రభుత్వరంగ సంస్థలు ప్రజా సంక్షేమానికి పట్టుకొమ్మలు

**టిజెఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం**



డైరీ ఆవిష్కరిస్తున్న కోదండరాం, కరుణాకర్‌రెడ్డి, ఈశ్వర్‌గౌడ్ తదితరులు

హైదరాబాద్, ఫిబ్రవరి 7,ప్రభాతవార్త: ప్రభుత్వరంగ సంస్థలు ప్రజా సంక్షేమానికి పట్టుకొమ్మలని టిజెఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. ఈమేరకు బుధవారం తెలంగాణ ఎలక్ట్రిసిటీ అకౌంట్స్ స్టాఫ్ అసోసి యేషన్ (టిఈఏఎస్ఏ) నూతన భవనం ప్రారంభోత్సవం, 2024 డైరీ ఆవిష్కరణను జిటిఎస్‌కాలనీలో ఘనంగా నిర్వహించారు. దీనికి ప్రొఫెసర్ కోదండరాం ముఖ్యతిధిగా హాజరై ప్రారంభించి ప్రసంగించారు. ప్రభుత్వ రంగసంస్థలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క ఉద్యోగ సంఘంపై ఉందన్నారు. అసోసియేషన్ కార్యక్రమాల గురినంచి ప్రశంసిస్తూ సంఘం భవనాన్ని సభ్యులు తమ తమ రోజువారి విధి నిర్వహాణలో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు అవసరమైన శిక్షణ తరగతులు నిర్వహించాలని రాష్ట్ర పునర్నిర్మాణంలో ఉద్యోగులంతా తమ పాత్ర నిర్వహించాలని కోరారు. ఈకార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షు లు కరుణాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఈశ్వర్‌గౌడ్, కె.వి ప్రభాకర్‌రావు, వేద ప్రకాశ్, రాజు, సాంబశివరావు, అశోక్, బాలరాజు, రాజేందర్ పాల్గొన్నారు.

## తెలంగాణ అసెంబ్లీలో జ్యోతిరావుపూలే, సావిత్రిబాయిపూలే విగ్రహాలను ఏర్పాటు చేయాలి

**మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్**




వెనుకబడిన తరగతుల జాతీయ కమిటీ చైర్మన్ ఎం.భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో శాంతి దీక్షకు సంఘీభావం తెలిపిన మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, పాశం యాదగిరి

ధర్నాచౌక్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త: తెలంగాణ అసెంబ్లీలో మహాత్మా జ్యోతిరావుపూలే, సావిత్రిబాయిపూలే విగ్రహాలను ఏర్పాటుచేయాలని మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో వెనుకబడిన తరగతుల జాతీయ కమిటీ ఛైర్మన్ ఎం.భాగ్యలక్ష్మి శాంతి దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు హాజరై సంఘీభావం తెలిపిన అనంతరం నర్సయ్యగౌడ్ మాట్లాడుతూ రాజకీయాలకు, కులమతాలకు అతీతంగా పూలే దంపతులను చూడాలని, తక్షణమే వారి విగ్రహాలను అసెంబ్లీలో ఏర్పాటుచేసి, వారి ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వ పాలన ఉండే విధంగా చట్టాలు రూపొందిచాలని కోరారు. అనంతరం భాగ్యలక్ష్మి మాట్లాడుతూ దేశ జనాభాలో సగభాగం ఉన్న బీసీల ఆరాధ్యదైవం జ్యోతిరావుపూలే, ఆయన సతీమణి సావిత్రిబాయిపూలే విగ్రహాలను అసెంబ్లీలో ఏర్పాటుచేయాలని గత కొన్ని సంవత్సరాలుగా పోరాడుతున్నామని తెలిపారు. తెలంగాణ ప్రజాభవన్‌కు మహాత్మ జ్యోతిరావుపూలే పేరు పెట్టటం శుభపరిణామమని అన్నారు. పది సంవత్సరాలు అధికారంలో ఉండి, పూలే విగ్రహాలు అసెంబ్లీలో పెట్టకుండా అహంకారంతో వ్యవహరించిన బీఆర్ఎస్ నేతలు, కవితలకు అధికారం కోల్పోయిన తరువాత పూలే గుర్తుకు వచ్చారని ఎద్దేవా చేశారు. ఈ దీక్షా కార్యక్రమంలో కమిటీ నేతలు కే.అచ్చయ్య, రచ్చ శ్రీనివాస్, వి.దానకర్ణాచారి, చిన్నయ్య, మంజులత, అంబిక, సిహెచ్ రమేష్, సువర్ణ, పద్మాగౌడ్, లక్ష్మీబాయి, ప్రదీప్, రవికుమార్, వివిధ సంఘాల నేతలు బెల్ల మాధవి తదితరులు పాల్గొన్నారు.

## సుందరీకరణ

# కాగితాలకే పరిమితమా?

**మురుగునీరు, చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు ● ఆనవాళ్లు కోల్పోయిన మూసీ నది**

పేరుకు పోయిన చెత్తాచెదారంతో మురుగునీటితో మూసి నది పరివాహక ప్రాంతం ప్రాంతాలలో ఇండ్లు నిర్మించుకుని జీవిస్తున్న వారికి దోమల బెడద తీవ్రంగా ఉంటుంది.దీంతో దోమల బెడద కారణంగా బస్తీవాసులకు నిద్ర కరువై పోతుంది.దీనికితోడు దోమల కారణంగా విష జర్వాలకు గురవుతున్నారు.అంతేకాకుండా నాటి నుంచి నేటి వరకు రజక వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న రజకులకు దోమల మూలంగా అనేక ఇబ్బందులకు గురవుతు న్నారు.పిచ్చిచెట్లు,కంప చెట్లు అడ్డదిడ్డంగా పెరిగిపోయాయి.కనీసం వాటిని తొలగించాలనే ఆలోచన జిహెచ్ఎంసి అధికారులకు కలుగక పోవడం శోచనీయం. ప్రతియేటా రాష్ట్ర బడ్జెట్‌లో మూసినది అభివృద్ధికి కేటాయిస్తున్న నిధులు ఎక్కడి పోతున్నాయో అర్థం కావడంలేదని ప్రజలు అంటున్నారు.



3లో

మూసినదిలోకి వదులుతున్న మురికినీరు

పురానాపూల్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త: మూసినది అంటేనే.. గళ గళ పారే సెలరు ఒకప్పుడు. ప్రస్తుతం మూసినది మురుగునీరు ప్రవహించడం.. మూసికి రెండు వైపులా కబ్జాలతో కుదించుకుపోతుంది.

## పుప్పాలగూడలో విషాదం..

# అదృశ్యమైన బాలిక చెరువులో శవమైంది

నార్సింగి, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త : గండిపేట మండలం పుప్పాలగూడలో విషాదం చోటు చేసుకుంది. ఇంటి వద్ద ఆడు కుంటూ అదృశ్యమైన బాలిక చెరువులో మృతదేహమై తేలింది. ఈ విషాదకర సంఘటన నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గండిపేట మండలం పుప్పాలగూడ సాయి గౌతమి కాలనీలో గుడిసెలో ఉంటున్న జనార్ధన్‌కు 14.నెలల కూతురు మోక్షిత ఉంది. ఆ బాలిక ఈ నెల 6.వ,తేదీన ఇంటి ముందు ఆడుకుంటూ అదృశ్యమైంది. తల్లిదండ్రులు పరిసర ప్రాంతాలలో ఎంత వెతికినా ఫలితం లేకపోవడంతో నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో బాలిక పుప్పాలగూడలోని ముస్కిన్ చెరువులో శవమై తేలింది. స్థానికులు నీటిలో ఉన్న పాపను గుర్తించి బయటకు తీసి పోలీసులకు సమాచారం అందించారు. ఆ బాలిక తమ కూతురేనని తల్లిదండ్రులు గుర్తించి గుండెలవిసేలా రోధిస్తున్నారు. ఆడు కుంటూ వెళ్లి చెరువులో పడిందా? లేక మరేమైన ప్రమాదవశాత్తు నీటి లో పడిపోయిందా? అన్న విషయాలను వెలికి తీసేందుకు పోలీసులు సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నారు. బాలిక మృతదేహంను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియ ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు నార్సింగి పోలీసులు తెలిపారు.



బోయిన్‌పల్లి ప్లే గ్రౌండ్‌లోజిమ్ పరికరాలను పరిశీలిస్తున్న జంపన ప్రతాప్ తదితరులు

## కంటోన్మెంట్ ప్లే గ్రౌండ్‌ల అభివృద్ధికి కృషి : జంపనప్రతాప్

కంటోన్మెంట్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త: వ్యాయామానికి సంబంధించిన జిమ్ పరికరాలను అందుబాటులో ఉంచాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ తెలిపారు. బుధవారం కంటోన్మెంట్ బోర్డు బోయిన్‌పల్లి ప్లే గ్రౌండ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన జిమ్ పరికరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జంపన మాట్లాడుతూ రానున్న రోజుల్లో ప్లే గ్రౌండ్‌ను ఆధునీకరించేందుకు సిఈఓ మధుకర్ నాయక్ దృష్టికి తెచ్చి ప్లే గ్రౌండ్‌లో మౌళిక సదుపాయాలు మెరుగుపర్చడంతో పాటు గ్రౌండ్ అభివృద్ధి పర్చేందుకు నిధులు మంజూరైయ్యే విధంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రతినిధులు వెంకటేశ్, సాయిబాబా యాదవ్, కరణ్ సింగ్, జంపన రవి తదితరులు పాల్గొన్నారు.

## రహదారి భద్రత నియమాలు పాటించాలి

డిసిపి శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న డిసిపి శ్రీనివాస్

కొంపల్లి, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త : వాహనదారులు రహదారి భద్రత నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని సైబరాబాద్ ట్రాఫిక్ డిసిపి శ్రీనివాస్ అన్నారు. బుధవారం బాచుపల్లి క్యాంపస్‌లోని డాక్టర్ రెడ్డి లాబొరేటరీస్‌లో వార్షిక రహదారి భద్రత సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు డిసిపి వేణుగోపాల్ రెడ్డి, సైబరాబాద్ ట్రాఫిక్ ఏసీపీ వెంకటయ్య, కూకట్‌పల్లి డివిజన్ ట్రాఫిక్ ఏసీపీ గురువయ్య, ఇన్స్‌పెక్టర్‌లు టిటిఐ ఇంచార్జీ బి.కిరణ్ కుమార్, మియాపూర్ టిఆర్‌పీఎస్ ఆర్ఐ అనిల్‌కుమార్, ఎస్ఐపీలు మల్లేశ్వర్, నవీన్ కుమార్, టీటీఐ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గగన్‌పహాడ్‌లో అభివృద్ధి పనుల పరిశీలన



కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అధికారులతో కలిసి గగన్‌పహాడ్‌లో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న దృశ్యం

మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త : మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని గగన్‌పహాడ్‌లో నూతనంగా నిర్మిస్తున్న పైపు లైన్,భూగర్భ డ్రైనేజీ పైప్ లైన్ పనులను బుధవారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌ను అన్ని రంగాలలోను ఆదర్శవంతమైన డివిజన్‌గా తీర్చి దిద్దటానికి అహర్నిశలు కృషి చేస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు జోగి,తలారి చిన్న,తిరుపతి రెడ్డి,వినయ్‌రెడ్డి,వల్లూరి శ్రీను, అడికె జనార్దన్,శేఖర్‌రెడ్డి,మధు,మజరుద్దీన్ పాల్గొన్నారు.

### ఐపిఎల్ ఆన్ స్టార్ ప్రోమోలో పాల్గొన్న

## ఇండియన్ క్రికెట్ టీమ్ మాజీ ఆటగాళ్లు

నిజాంపేట్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త : విఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి ఇనిస్ట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో స్టార్ స్పోర్ట్స్ తెలుగు ఆధ్వర్యంలో బుధవారం ఐపిఎల్ ఆన్ స్టార్ పేరిట ఐపిఎల్ ప్రోమో కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో ప్రముఖ క్రికెటర్లు ఎమెస్కె ప్రసాద్, ఇర్ఫాన్ పఠాన్ సందడి చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్టార్ స్పోర్ట్స్ ప్రతినిధులు విద్యార్థులతో వినోదభరితమైన ఆటలు ఆడించారు. స్టార్ స్పోర్ట్స్ తెలుగు ఐపిఎల్ వ్యాఖ్యాత్రి విద్యవిశాఖ ఎమెస్కె ప్రసాద్, ఇర్ఫాన్ పఠాన్‌లతో చర్చా కార్యక్రమం నిర్వహించగా, వారు ఐపిఎల్‌తో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. తమ క్రికెట్ కెరియర్‌లోనే విశేషాలను పంచుకుంటూ మహేంద్రసింగ్ ధోని, రోహిత్‌శర్మ, విరాట్‌కోహ్లీ వంటి దిగ్గజాలతో ఉన్న అనుబంధాన్ని తలుచుకున్నారు. గ్రీన్ రూమ్‌లో అంతర్జాతీయ క్రీడాకారులతో ఒక జట్టుగా ఉన్నప్పుడు జరిగే సరదా సంభాషణలు, యువ క్రికెటర్లకు సీనియర్ల నుంచి దొరికే సలహాలు, మార్గదర్శనం ఎంతో ముఖ్యమని ఐపిఎల్ వల్ల అటువంటి అవకాశాలు విస్తృతంగా లభిస్తాయని ఇర్ఫాన్ పఠాన్ అభిప్రాయపడ్డారు.

## దళితులను రాజ్యాధికారానికి దూరం చేయడానికే వర్గీకరణ చిచ్చు

సైఫాబాద్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త: దళితులను రాజ్యాధికారానికి శాశ్వతంగా దూరం చేయడానికి ఎస్సీ వర్గీకరణ కోసం సుప్రీంకోర్టుని సైతం ప్రభాతవితం చేసిన బిజెపి, పిఎం నరేంద్రమోదీ, ఆర్ఎస్ఎస్ మాఫియా సర్కార్‌పై తిరుగుబాటు చేయాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణస్వరూప్ పిలుపునిచ్చారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు దక్షిణాది రాష్ట్రాలలో రాజకీయంగా లబ్ధి పొందడానికి మోదీ సర్కార్ చూస్తున్నదని ప్రధానంగా రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్ స్ఫూర్తిని దెబ్బతీయడానికి మనువాద కాషాయి క్రిమినల్ రాజ్యం చూస్తున్నదని ధ్వజమెత్తారు. బుధవారం నాడిక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిజెపి ఎన్నికల రాజకీయాల కోసం సుప్రీంకోర్టును సైతం ఇందులో భాగస్వామ్యం చేయడం అత్యంత దారుణమన్నారు.

### మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్

## గెలుపుకు నిరంతర కృషి: కొలను హనుమంతరెడ్డి

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త : కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్దే లక్ష్యంగా పనిచేసి రానున్న మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపుకు నిరంతరం కృషిచేయాలని కుత్బుల్లాపూర్ నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలను హనుమంతరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం కుత్బుల్లాపూర్ డివిజన్ పార్లమెంట్ ఎన్నికల బూత్‌స్థాయి సమావేశానికి ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి అసెంబ్లీ నియోజక వర్గ అభివృద్ధికి రూ.లు. 10కోట్ల నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరి చేసిందన్నారు. కుత్బుల్లాపూర్ పరిధిలోని ప్రతిడివిజన్‌కు కోటి రూపాయల వ్యయంతో నిర్వహించే నిధులలో పాఠశాల అభవృద్ధికి 20శాతం, నీటి సమస్యల పరిష్కారానికి 10శాతం నిధులు, 70శాతం నిధులు భూగర్భ డ్రైనేజీ రోడ్లు, మరమ్మత్తులు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలకు కేటాయిచి పనులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దమ్మాని శ్రావణ్‌కుమార్, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎండి. జాకీర్, నాయకులు రామదుగు సిద్దయ్య, జగదీష్‌గౌడ్ లతోపాటు పెద్దఎత్తున మహిళా నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

### పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్

## వెంటనే విడుదల చేయాలి: ఎబివిపి

కంటోన్మెంట్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త: పెండింగ్‌లో ఉన్న 5వేల300 కోట్ల ఫీజు రీయింబర్‌మెంట్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ కూకట్‌పల్లి విభాగం ఆధ్వర్యంలో సికింద్రాబాద్ క్లాక్‌టవర్ వద్ద బేగంపేట్, ప్యారడైజ్ టౌన్ విద్యార్థులు మహాధర్నా జరిపారు. ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు పూర్తయినా విద్యా వ్యవస్థపై ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం ప్రభుత్వానికి సిగ్గుచేటని విద్యార్థి నాయకులు అన్నారు. గత ప్రభుత్వం విద్యార్థుల ఆగ్రహానికి బలైపోయి కూలిపోయిన విషయం తెలిసికూడా అదే వైఖరిని కొనసాగించడాన్ని ప్రతీ విద్యార్థి గమనిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి విద్యార్థుల సమస్యలపై దృష్టిపెట్టి విద్యారంగ అభివృద్ధికి పూనుకోవాలని, లేకపోతే విద్యార్థుల నుండి మరో ఉద్యమ పోరాటం తప్పదని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాలు, మహేష్, సాకేత్, సికింద్రాబాద్ పీజీ కాలేజీ ప్రెసిడెంట్ చంద్రకాంత్, సెక్రటరీ చందు, ఎస్ఎఫ్ఎస్ కన్వినర్ గగన్, జ్యోష్నా, శివాణి, ఏబీవీపీ విద్యార్థి నాయకులు సందీప్, మహాలక్ష్మీ, ఉమా, మహేశ్వరీ, వర్ష, నాగరాజు, మహేష్, ముఖేష్, వంశీ, దినేష్, అక్షయ్, మనోజ్ పాల్గొన్నారు.

## చెత్తను జిహెచ్ఎంసి రిక్షాల్లో వేసి స్వచ్ఛతకు సహకరించాలి

పాపిరెడ్డినగర్ బస్తీ అధ్యక్షుడు చంద్రారెడ్డి

కెపిహెచ్‌బి కాలనీ, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త : ఇంట్లో నిత్యం పేరుకుపోయిన చెత్త చెదారాన్ని రోజు ఇంటిముందుకు వచ్చే జిహెచ్ఎంసి చెత్త రిక్షాల్లో మాత్రమే వేయాలని, బహిరంగ ప్రదేశాల్లో వేయకూడదని పాపిరెడ్డి నగర్ బస్తీ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి అన్నారు. బస్తీలోని పార్క్ సమీపంలో నిత్యం చెత్త వేయడాన్ని గమనించిన జిహెచ్ఎంసి అధికారుల అదేశాలతో సిబ్బంది స్థానికులకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా జిహెచ్ఎంసి సిబ్బంది పాపిరెడ్డి నగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో చంద్రారెడ్డి పాల్గొని బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా నిత్యం ఇంటి ముందుకు వచ్చే చెత్త రిక్షాల్లో వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చంద్రారెడ్డి, బిఆర్ఎస్ కూకట్‌పల్లి డివిజన్ ప్రధాన కార్యదర్శి మొగుళ్ళ కనకారెడ్డి, జిహెచ్ఎంసి సిబ్బంది రాములు, మార్క్, రాణి, స్వాతి, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

## జంతు సంరక్షణ కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే గాంధీ

వివేకానంద నగర్ కాలనీ, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త : శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ 124 డివిజన్ కార్పోరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌తో కలిసి ఎల్లమ్మబండలోని జంతు సంరక్షణ కేంద్రాన్ని బుధవారం సందర్శించి వీధి కుక్కల కుటుంబ నియంత్రణ ఆపరేషన్ ప్రక్రియ, జంతు సంరక్షణ కేంద్రం యొక్క విధివిధానాల గురించి సిబ్బందితో చర్చించారు. తదనంతరం ఆయన మాట్లాడుతూ జంతు సంరక్షణ కేంద్రంలో జంతువులకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసి వాటిని వేరువేరు కెనాల్స్‌లో పెట్టి నాలుగైదు రోజులు సమస్త పర్యవేక్షణ కేంద్రంలో ఉంచి బయటకు వదులుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన జంతు సంరక్షణ కేంద్రాన్ని పరిశుభ్రమైన వాతావరణంలో నిర్వహిస్తున్న సిబ్బందిని అభినందించి, ఇటీవల వీధి కుక్కల వలన జరిగిన దురదృష్ట సంఘటన దృష్టిలో ఉంచుకుని సిబ్బంది మరింత అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాశినాథ్ యాదవ్, శివరాజ్‌గౌడ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆల్విన్ కాలనీ అంబేద్కర్ నగర్‌లో హిందూ స్మశానవాటిక కబ్జాకు యత్నం

అడ్డుకున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

కెపిహెచ్‌బి కాలనీ, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త : శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో గల ఎల్లమ్మబండ అంబేద్కర్ నగర్ హిందూ స్మశానవాటికలో కొందరు కబ్జాదారులు చేరి రేకులతో ఫినిసింగ్ వేసి స్మశానవాటిక స్థలాన్ని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని తెలియడంతో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ స్థానిక కార్పోరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌లు సంఘటన స్థలానికి వెళ్ళారు. సంబంధిత అధికారి యంత్రాంగంతో పోలీసులతో కలిసి స్మశానవాటికను పరిశీలించి అక్రమంగా నిర్మిస్తున్న ఫినిసింగ్‌ను వెంటనే తొలగించాలని పోలీస్ శాఖ వారిని, సంబంధిత అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కబ్జాదారులు ఎవరైనా సరే ఉపేక్షించేదిలేదని వారిని చట్టపరంగా శిక్షించి తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. గతంలో ఇదే స్మశానవాటికకు ప్రాథమిక సౌకర్యాలు కల్పించడానికి పునాది రాయి వేసి శంకుస్థాపన చేశామని అన్నారు. అతి త్వరలో స్మశానవాటికకు ప్రహరి, అంతర్గత రోడ్లు, వాకింగ్ ట్రాక్‌తో పాటు స్మశాన వాటికలో మొక్కలను పెంచి ఉద్యానవనంగా ఏర్పాటు చేసి అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. అంతిమయాత్రలో కూడా ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా స్మశానవాటికకు కావల్సిన వసతులు చేకూర్చుతామని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యర్తలు, ఎల్లమ్మబండ వాసులు పాల్గొన్నారు.

## ఎన్టీ రామారావుకు భారతరత్న ప్రకటించాలి

సికింద్రాబాద్ టీడీపీ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా



మౌనదీక్ష చేపట్టిన టీడీపీ నేతలు

ధర్నాచౌక్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త: మహానటుడుగా, రాజకీయ నాయకుడిగా భారతదేశ చరిత్రలో, తెలుగు ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీ రామారావుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే భారత రత్న ప్రకటించాలని అఖిల భారత ఎన్టీఆర్ అభిమాన సంఘాల సమాఖ్య అధ్యక్షులు, సికింద్రాబాద్ టీడీపీ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం అఖిల భారత ఎన్టీఆర్ అభిమాన సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకుని, పెద్ద ఎత్తున మౌన దీక్ష చేపట్టారు. దీక్ష అనంతరం సాయిబాబా మాట్లాడుతూ ఎన్టీఆర్ రాజకీయ నాయకుడిగా తొలిసారిగా భారత దేశంలో అతి తక్కువ కాలంలో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసి, సంక్షేమ రాజ్యానికి శ్రీకారం చుట్టిన మహనీయుడని కొనియాడారు. ఈ దీక్షా కార్యక్రమంలో టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శులు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్‌గౌడ్, ఎన్టీఆర్ అభిమాన సంఘాల నేతలు శ్రీపతి సతీస్, నాగు నగేష్, ఎన్.ప్రకాష్, అప్పారావు, హనుమంతురెడ్డి, యాదగిరి రావు, భవాని, శ్రీనివాస్, వల్లారపు శ్రీనివాస్, మోహన్, టీడీపీ నేతలు యాదగిరిరావు, సత్తెన్న, యాదగిరి, రామ్‌నారాయణ, ఎం.కే.బోసు, ప్రమీల, ఝాన్సీ, శ్యాంసుందర్, నందకిషోర్, కృష్ణగౌడ్, చంద్రమోహన్‌గౌడ్, కిరణ్, భాను ప్రకాష్, సత్యనారాయణ, వెంకటేష్‌చౌదరి, నరహరిగౌడ్, మురళీకృష్ణ, భిక్షపతిచారి, జోగిందర్‌సింగ్, బాలకృష్ణ, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

# సుందరీకరణ కాగితాలకే పరిమితమా?

పురానాపూల్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త: మూసినది అంటేనే.. గళ గళ పారే సెలరు ఒకప్పుడు. ప్రస్తుతం మూసినది మురుగునీరు ప్రవహించడం.. మూసికి రెండు వైపులా కబ్జాలతో కుదించుకుపోతుంది. నాటి ఉమ్మడి పాలకలనుంచి, నేడు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అప్పటికి పాలకులు,అధికారులు ఏమాత్రం కబ్జాలను నివారించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. మూసినదికి(ముంచుకుందానది)పేరు ఉండేది. ఒకప్పుడు మూసినదిలో గండిపేట,హిమయత్‌సాగర్ జలశాయాల నుంచి నార్సింగ్,టిప్పుఖాన్ పూల్,లంగర్‌హౌజ్ సంఘం మూసినది మీదుగా కిషన్‌బాగ్,పురానాపూల్ వంతెన, ముస్లీం జంగ్‌పూల్,నయాపూల్,ఎంజిబిఎస్ ప్రక్క ఉన్న మూసినది కాలువ మీదుగా చాదర్‌ఘాట్,అంబర్‌పేట్, ఉప్పల్ భగయాత్ మీదుగా రంగారెడ్డిలోని పలు ప్రాంతాలనుంచి కృష్ణనదిలో మూసినది ప్రవహిస్తుఉండేది. నాడు మూసినదిలో ప్రవహించే నీటిలో ప్రజలు, సాన్నాలు,రజకులు తమ వృత్తిపై ఆధారపడే వారు. దీనికి తోడు వ్యవసాయదారులు తమ పొలాలలో మళ్లించుకుని పంటలు పండించుకునే వారని వినికిడి. మూసినదిలో ప్రవహించే నీటిలో నాటి ఐదు,పది, ఇరువైపైసలు,చారాణా,హారాణాలు వేస్తే కనిపించేవి. ఉమ్మడి రాష్ట్రంలో పాలకులు,అధికారులు పూర్తిగా ద్వంసం చేయడంతోపాటు గత 10 సంవత్సరాలు పరిపాలించిన బిఆర్ఎస్ ప్రభుత్వం కూడా మూసినది ఏమాత్రం పట్టించుకోలేదు. ఇష్టానుసారంగా మూసినది ప్రక్కనే బహుళఅంతస్థులు,కబ్జాలు చేసుకుని వ్యాపారాలు చేస్తున్నారు. వాటిని తొలగించేందుకుగాను అటు జిహెచ్ఎంసి,ఇటు రెవెన్యూ అధికారుల సమన్వయ లోపం మూలంగా మూసినది పూర్తిగా కబ్జాదారుల చేతులలోకి వెళ్లింది. తమకు నిజాం రాగి పత్రాలపై వ్రాసి ఇచ్చినట్లు చెప్పుకుని,న్యాయస్థానాలలో కేసులు వేస్తున్నారు. మురుగునీటి కాలువలను నేరుగా మూసినదిలో పైపులైన్లు కలిపి మూసినదిని పూర్తిగా మురుగునీటి మూసిగా మార్చారు. ఏనాడు పాలకులు, సంబంధిత అధికారులు మూసినది పరివాహక ప్రాంతాల నుంచి మురుగునీరు ఎక్కడి వెళ్తుంది. పరిశీలించిన పాపాన పోలేదు. దీనికితోడు మూసినది వంతెన కింద మురుగునీటితో నిండిపోయి ఉంటుంది. లంగర్‌హౌజ్, కార్వాన్, కిన్‌బాగ్, జియాగూడ, పురానాపూల్, దూల్‌పేట్, ముస్లీంజంగ్‌పూల్, అఫ్జల్‌గంజ,గౌలిగూడ,చాదర్‌ఘాట్, మలక్‌పేట్,నింబోలిఅడ్డా,అంబర్‌పేట్ తదితర ప్రాంతాలలో కొత్త వెలిసిన భవనాలన ంచి నేరుగా మూసినదిలోకి మురుగునీరు ప్రవహించే విధంగా కలుపుతున్నారు. అధికారులకు,సిబ్బందికి తెలిసినప్పటికి మనకు ఎందుకు గొడవ అంటూ చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో వారి అగడాలకు అడ్డు అదుపు లేకుండా పోతుంది. మూసిలోకి పైపులైన్ కలుపుకోవడం,చేతులు దులుపుకోవడం జరుగుతుంది. ఇప్పటికైనా తెలంగాణ నూతన కాంగ్రెస్ ప్రభుత్వ ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి దావోస్ పర్యటనలో మూసినది సుందీరకరణపై చర్చించారు. సచివాలయంలో కూడా ఉన్నతాధికారులతో మూసినది అభివృద్ధి ప్రణాళికపై చర్చించారు. ఇప్పటికైనా స్పందించి మూసినదిలో అభివృద్ధి పనులు చేపట్టి సుందీకరణగా చేపట్టాలని ప్రజలు కొత్త కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

### సంస్కృతి, కళలను పరిరక్షించే గొప్ప మనస్సున్న

## మానవతావాది, మేధావి డాక్టర్ కె.వి.రమణాచారి

వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ వైస్‌చాన్స్‌లర్ ఆచార్య కొలకలూరి ఇనాక్



రఘుశ్రీ రచించిన 'కవీంద్రమోక్షం' గ్రంథాన్ని ఆవిష్కరించిన దృశ్యం

చిక్కడపల్లి, ఫిబ్రవరి 7ప్రభాతవార్త: సంస్కృతి, కళలను పరిరక్షించే గొప్ప మనస్సున్న మానవతావాది, మేధావి డాక్టర్ కె.వి.రమణాచారి అని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ వైస్‌చాన్స్‌లర్ ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. బుధవారం రాత్రి త్యాగరాయ గానసభలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల సందర్భంగా గానసభ అధ్యక్షుడు కళావిఎస్. జనార్ధనమూర్తి ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమాల్లో భాగంగా సాహిత్య సభ మానస ఆర్ట్స్ థియేటర్స్ అధినేత, ప్రముఖ కవి రఘుశ్రీ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆచార్య కొలకలూరి ఇనాక్ మాట్లాడుతఊూ జీవితం ఎందరికో స్ఫూర్తిదాయకం, ఆదర్శప్రాయమైన విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా కవి రఘుశ్రీ రచించిన 'కవీంద్రమోక్షం' రచన ఎంతో విలక్షణమైందని, హాస్య, వ్యంగ్య, సామాజిక స్పృహ కలిగిన కవితలున్నాయన్నారు. ఉత్తమ సాహిత్య గ్రంథావిష్కరణతో పాటు సమాజహితం కోసం శ్రమించే కవులచే కవిసమ్మేళనం నిర్వహించడం గొప్పదని, ఇందుకు గానసభ వేదిక కావడం అభినందనీయమన్నారు. అనంతరం జరిగిన కవిసమ్మేళనంలో కవులు తమ అమూల్యమైన కవితలను వినిపించారు. సభలో లక్ష్మణరేఖ గోపాలకృష్ణ, రాధశ్రీ, గుళ్ళపల్లి ఆంజనేయులు, కెవిఎల్.కామేశ్వరరావు, బాలగంగాధరయ్య పాల్గొన్నారు.

## కమ్యూనిటీ హాల్ అభివృద్ధికి సమావేశం

కార్పొరేటర్ పావనీ వినయకుమార్

చిక్కడపల్లి, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త: గాంధీనగర్ డివిజన్‌లోని జవహర్‌నగర్ కమ్యునిటీ హాల్‌లో గత కొంతకాలంగా నిలువ ఉంచిన బతుకమ్మ చీరలు తొలగించినందుకు జవహర్‌నగర్ ఎస్సార్టీ అసోసియేషన్ స్థానిక కార్పొరేటర్ ఎ.పావనీ వినయ కుమార్, బిజెవైఎం పూర్వ జిల్లా అధ్యక్షుడు ఎ.వినయ కుమార్‌కు జవహర్‌నగర్ ఎస్సార్టీ, జవహర్‌నగర్ వ్యాయామశాల, ఆటస్థలం, కల్యాణమంటపం పరిరక్షణ కమిటీ ప్రతినిధులు నర్మెట్ట మల్లేష్, మారిశెట్టి నర్సింగ రావు, గుండు నాగేశ్వరరావులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు కృష్ణ, దేవయ్య, మహేందర్ పాల్గొన్నారు.

## మేడారం జాతర ప్రత్యేక బస్సులు : ఆర్.ఎం ఎ.శ్రీధర్

అఫ్జల్‌గంజ్, ఫిబ్రవరి 7ప్రభాతవార్త: మేడారం మహా జాతరకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం రంగారెడ్డి జిల్లా రీజినల్ టిఎస్ఆర్ టిసి ఆధ్వర్యంలో ఈనెల 9వ తేది నుంచి ప్రతి రోజు మూడు బస్సులను నడుపు తున్నట్లు టిఎస్ఆర్‌టిసి రీజినల్ మేనేజర్ ఎ.శ్రీధర్ తెలిపారు. ఉదయం 6గంటలకు, 6గంటల30 నిమిషాలకు, 7గంటలకు మహాత్మాగాంధీబస్‌స్టేషన్ నుంచి మూడు సూపర్‌లగ్జరీ బస్సులు బయలు దేరి ఉప్పల్,హన్మకొండ,వరంగల్ మీదుగా మేడారం చేరుకుంటాయన్నారు. ఈ బస్సుల్లో పెద్దకుల ఒకరికి 750రూపాయలు,చిన్నపిల్లలకు 450 రూపాయలు చార్జీల కింద వసూలు చేయడం జరుగుతుందన్నారు. మేడారం వెళ్లే భక్తులు టిఎస్ఆర్‌టిసిలో సీట్లను రిజర్వేషన్ చేసుకునే అవకాశం ఉందన్నారు. మేడారం నుంచి మధ్యాహ్నం 2గంటలకు, మధ్యాహ్నం 2గంటల 30 నిమిషాలకు, 3మూడుగంటలకు బస్సులు ఉంటాయన్నారు.

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
GHMC

'ఇ' ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన నం. 30/EE/సర్కిల్ నం.17/KZ/GHMC/2023-24, తేది: 06.02.2024. నిట్ నం: ఫైన పేర్కొన్నది పనిపేరు: సివిల్ పనులు (04నం.లు). అంచనా మొత్తం/ECV: రూ.94.40 లక్షలు. ప్రారంభ తేది/డౌన్‌లోడ్ ముగింపు తేదీ, సమయం: క్ర.సం. 01 to 04 పనులకు: 07.02.2024 మ.3.00గం. నుండి 14.02.2024 మ.12.00గం. వరకు మాత్రమే. అధికారి పేరు, చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-17, GHMC. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ https://www.tender.eprocurement.gov.in వద్ద చూడవచ్చును. ఇ-మెయిల్ చిరునామా: eec17.ghmc@gmail.com. మొబైల్ నం: 7337557246.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-17, KZ, GHMC.

DIPR.No.10185-PP/CL/Advt/1/2023-24 తేది: 07.02.2024

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
GHMC

నిట్ నం. 38/EE-28/SBZ/GHMC/2023-24

పనిపేరు: నిర్వహణ పనులు ఇతరములు-24. అంచనా మొత్తం (రూ.లక్షలలో): 390.00. బిడ్ దాఖలు ప్రారంభ/ముగింపు తేదీలు, సమయం: 07.02.2024 సా.4.00గం. 14.02.2024 సా.4.00గం. అధికారి పేరు, చిరునామా, సెల్ నం: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ 9154796465. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ http://www.tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్ నం.28, GHMC.

DIPR.No.10179-PP/CL/Advt/1/2023-24 తేది: 07.02.2024

వార్త VAARTHA CLASSIFIEDS — CLASSIFIEDS — వార్త VAARTHA CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, Madhusudhana Rao Gadalay. R/o. H.No.3-5-1094/4/E, Venkateshwara Cly. Narayanguda, Hyd.T.S. Changed My Name As "MADHUSUDHAN RAO GADALAY" S/o. CHINTAJI RAO GADALAY.

(Ro.No.6119484)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

## మారేడ్‌పల్లి డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లను తక్షణమే అలాట్ చేయాలి : లబ్దిదారులు

కంటోన్మెంట్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త: కంటోన్మెంట్ నియోజకవర్గం మోండా డివిజన్‌లో స్థానిక లబ్ధిదారులకు ప్రభుత్వం నిర్మించిన డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లను తక్షణమే అలాట్ చేయించాలని స్థానిక లబ్ధిదారులు ఉమా శంకర్, జగ్గం మహేశ్, వాజిద్,లావణ్య, హనీలు, ముఖ్య మంత్రి క్యాంప్ కార్యాలయంలోనిప్రజా వాణిలో దరఖాస్తు చేసుకున్నారు. బస్తీలో దాదాపు 450 డబుల్‌బెడ్ ఇండ్లు నిర్మించగా కేవలం 251 మందికి మాత్రమే అలాట్ చేయడం జరిగింది. ఇంకా 170 మంది లబ్ధిదారులకు ఫ్లాట్లు అలాట్ చేయాలి సుండగా రెవెన్యూ అధికారులు సర్వేల మీద సర్వేలు జరపడం తప్పా అలాట్ చేదయడం లేదని ప్రజా వాణిలో ఫిర్యాదు చేసుకున్నారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రత్యేక చొరవ తీసుకొని అర్హులైన లబ్ధిదారులకు 2బిహెచ్‌కె ఇండ్లు అలాట్ చేయాలని నోడల్ అధికారి దివ్య అధికారులకు సూచించారు.



మారేడ్‌పల్లి డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్ల కెటాయింపు కోసం ప్రజా వాణిలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు

IN THE COURT OF THE ON THE IIND ADDL DISTRICT AND SESSIONS JUDGE AT MEDCHAL
OS.NO.53 OF 2023

Between:
Dr.Madireddy Raghuveer Reddy S/o. M.Malla Reddy Aged about 48 years Occ: Business, R/o. H.No. 16-1-27/8/2, Jayanagar Colony, Opp: Prime Swimming Pool Saidabad, Hyderabad.
...Plaintiff
And
Smt. Bommineni Saritha @ Bachu Gollapally Saritha
...Defendant

To
Smt. Bommineni Saritha @ Bachu Gollapally Saritha, W/o. B.Narasimha Reddy D/o. Late Gollapally Shankar Reddy, R/o. Flat No. 302, Mahalaxmi Enclave Sangeeth Nagar, Kukatpally, Hyderabad and also R/o. Flat No.311, Prithvi Opulence, Sringfiled colony Jeedimetla Village, Hyderabad.
Please take notice that the petitioner hereinabove has filed the above suit for specific performance of contract against you vide Os No. 53/2023, that the Hon'ble IInd Addl. District Judge at Medchal allowed the IA on 31.1.2023 for publication of notice on you in Eenadu and Nava Telangana and the above suit is posted to 10.4.2024 for your appearance and in case of your default to appear in person or through counsel, the same will be heard and determined in your absence.
(By Order of The Hon'ble Court)
Sd/- G.Madhusudhan Reddy
B.Anand
Advocates
Flat No.203, Balaji Residency
Gokulnagar, Tarnaka,
Secunderabad 500017.

IN THE COURT OF THE HON'BLE I ADDL.JUNIOR CIVIL JUDGE, MEDCHAL-MALKAJGIRI DISTRICT AT MALKAJGIRI.
OS NO. 61 OF 2024

Between:
Sri Dubbaka Mohan Rao and others
..... plaintiffs
AND
The Tahasildar Malkajgiri mandal and another.
...defendants.

NOTICE

Please take notice that the above said suit is filed by the plaintiffs to declare them as legal heir of Late Dubbaka Padmasree, same is posted on 21-02-2024. If any person is having any objection or right, they can make appearance, either by a person or pleader, failing which Hon'ble court shall proceed further as per law.

"BY COURT ORDER"
Lingamsetty Subba Rao
Advocate
Malkajgiri,
Hyderabad 500 047
Mobile No:9866979845
Office phone: 91-40 3570 2505

IN THE COURT OF THE HON'BLE IV ADDL. SENIOR CIVIL JUDGE, RANGA REDDY DISTRICT : AT: L.B.NAGAR
I.A.NO. 58 OF 2023
IN
O.S.NO. 394 OF 2023
AND ALSO IN THE MAIN SUIT
OS.NO. 394 OF 2023

Between:
Madugula Bikshapathi & Others
..... Petitioners/Plaintiffs
AND
Goshika Venkatesh & Others
...Respondents/Defendants.

To,
Sri.Amshala Venkatesh, S/o. A.Sattiah, Aged About 59 Years, Occ: Business, R/o. H.No. 5-5-933/4P, Plot No.4, Agamaiah Nagar, Chinthal Kunta, Ranga Reddy District.
...Respondent No.3/Defendant No.3
Please take notice that the Petitioner/Plaintiff filed the above Petition and suit i.e.I.A.No.58 OF 2023 in O.S.No. 394 of 2023 filed U/O 39 Rule 1 and 2 of C.P.C.Os.No.394 of 2023 for Perpetual Injunction on the file of Hon'ble IV Addl. Senior Civil Judge, Ranga Reddy District: At : L.B.Nagar against above mentioned RESPONDENT No.3/DEFENDANT No.3 in the above said suit. The said I.A.No. 58 of 2023 and OS.No. 394 of 2023 is posted on 12-03-2024 for your appearance. Therefore your should be present in person or through Advocate on the aforesaid date at 10.30 A.M. otherwise you will be set exparte on the said day and the same will be decided on merits.
By Order of the Court
V.Srinivas
Y.Bhasker
Advocates
Res: H.No.8-2-268/C/10, Road No.3, Arora Colony, Banjara Hills, Hyderabad-34
Ph.No. 9848996008.

# కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం : ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి


అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, చైర్‌పర్సన్ అనురాధ రాంరెడ్డి తదితరులు

**తుర్కయంజాల్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:** తుర్కయంజాల్‌ను ఆదర్శంగా తీర్చి దిద్దడమే లక్ష్యమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. తుర్కయంజాల్ పురపాలిక పరిధిలోని 7, 8, 9, 10, 20 వార్డులలో రూ. 3.18కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు చైర్ పర్సన్ అనురాధ రాంరెడ్డి, కౌన్సిలర్లతో కలిసి ఎమ్మెల్యే రంగారెడ్డి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం మన్నెగూడలోని ప్రముఖ్ టౌన్‌షిప్‌లో జరిగిన సమావేశంలో రంగారెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఆనందంగా ఉండాలనేదే కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచన అని ఎమ్మెల్యే రంగారెడ్డి అన్నారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ ప్రకటించిన ఆరు గ్యారంటీల ద్వారా పేదలకు ఎంతో మేలు జరుగుతుందని ఇప్పటికే రెండు గ్యారంటీలను అమలు చేస్తున్నామన్నారు. వచ్చే నెలలో మరో రెండు అమలు కాబోతున్నట్లు వివరించారు. ఇది దొరల పాలన కాదు ప్రజల పాలనలో ప్రతి ఒక్క అధికారులు సమన్వాయంతో సమిష్టిగా పనిచేయాలని అన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. అలాగే తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో అధికారులు–ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి, ప్రజలకు అన్ని రంగాల్లో ఈ సమస్యలు తలెత్తకుండా క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. మున్సిపాలిటీలోని కాలనీలో అభివృద్ధి జరిగేలా ప్రణాళికలు రచించి వాటిని అభివృద్ధి చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సిహెచ్ శ్రీకాంత్, వైస్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి హరిత ధనరాజ్‌గౌడ్, నాయకులు కాకుమాను సునీల్, కొశికె ఐలయ్య, కొత్తకుర్మ మంగమ్మ శివకుమార్, కౌన్సిలర్లు, సామ భీమ్‌రెడ్డి, కొంతం వెంకట్‌రెడ్డి, కృష్ణారెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నిర్లక్ష్యంగా పని చేసే అధికారులపై చర్యలు తప్పవు : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు, అధికారులు

**ఉప్పల్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త :** ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించేందుకు అధికారులు నిజాయితీగా పనిచేయాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఉప్పల్ సర్కిల్ కార్యాలయంలో స్థానిక కార్పొరేటర్లు బన్నాల గీత, బండారు శ్రీవాణి, కక్కిరేణి చేతన, డిసి శ్రీనివాస్, మున్సిపల్ ఇంజనీర్ ఎల్.నాగేందర్, తహసీల్దార్ వెంకట నరసింహా రెడ్డి, జలమండలి జీఎం సంతోష్‌కుమార్‌లతోపాటు వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఉప్పల్ సర్కిల్‌లో ఎక్కడ పని ప్రారంభించినా వెంటనే పూర్తి చేయాలని, రోడ్లు తవ్వి వదిలి వేయవద్దని సూచించారు. కాంట్రాక్టర్లు ఎక్కడ పడితే అక్కడ రోడ్లు తవ్వి వదిలివేస్తున్నారని, దీనిని సహించేది లేదన్నారు. ఉప్పల్ పారిశ్రామికవాడలోని పలు ప్రాంతాల్లో రెడీమిక్స్ ప్లాంట్లు అనుమతి లేకుండా నడిపిస్తున్నారని, రోడ్లపై వ్యర్థాలు వేస్తున్నారని, వారిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. వంద గజాలలోపు నిర్మించుకునే ఇళ్ల నిర్మాణం విషయంలో చూసిచూడనట్లు వ్యవహరించాలని కోరారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు వివక్ష లేకుండా పనిచేయాలని సూచించారు. రోడ్లపై ర్యాంపులు వేసి నిర్మాణాలు చేస్తున్నారని, రోడ్లు ఆక్రమించి ఇళ్లు నిర్మించేవారిపై తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. సర్కిల్‌పరిధిలో చాలా చోట్ల పెద్ద పెద్ద హోటల్స్ ముందు పార్కింగ్ లేకుండా వాహనాలు రోడ్డుపై నిలిపి ఇబ్బంది కలిగిస్తున్నారని, వారిపై తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. హోటల్స్‌లో నిత్యం తనిఖీలు చేయాలని, కల్తీ ఆహారం పెరిగి పోయిందని పేర్కొన్నారు. ఒయు బస్తీలో ఉన్న పేదలకు ఆరు నెలలలోగా ఇళ్లు మంజూరు చేయిస్తామని, అప్పటి వరకు వారికి ఉచితంగా నీటి ట్యాంకర్లు పంపించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ స్థలాలు కబ్జా చేస్తే సహించేది లేదని, ఎక్కడైనా అక్రమాలు జరిగితే వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. రామంతాపూర్ చిన్న చెరువు, రోడ్లు, మురుగునీటి సమస్యపై స్థానిక కార్పొరేటర్ బండారు శ్రీవాణి అధికారుల దృష్టికి తీసుకుని వచ్చారు. చెత్త తరలించే వాహనాల డీజిల్ అక్రమాలు జరుగుతున్నాయని, కాలనీలో సమస్యలు పరిష్కరించడం లేదని కార్పొరేటర్ చేతన పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు కాలనీవాసులు అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, కాలనీవాసులు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

## సిఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బాల్క సుమన్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

**మలక్‌పేట, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:** బిఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై చర్యలు తీసుకోవాలని తెలంగాణ కాంగ్రెస్ కమిటీ షెడ్యూల్డ్ కాస్ట్ విభాగం రాష్ట్ర కన్వీనర్ బోనగిరి చంద్రశేఖర్ డిమాండ్ చేసారు. ఈ మేరకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన మలక్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 5వ తేదీన మంచిర్యాలలో జరిగిన బిఆర్ఎస్ సమావేశంలో సిఎం రేవంత్‌రెడ్డిపై బాల్క సుమన్ అనుచిత వ్యాఖ్యలు చేసారని ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సునిత్ పత్తి, ముప్పిడి ధన్వంత్, వినోద్‌కుమార్, మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## గుర్రంగూడ ఆదిత్యనగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షునిగా పుట్టగళ్ళ రవీందర్

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని గుర్రంగూడ ఆదిత్యనగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షునిగా పుట్టగళ్ళ రవీందర్ ఎన్నికయ్యారు. కాలనీలో జరిగిన ఎన్నికల్లో సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ప్రజలు ఎన్నుకున్నారు. ఈ నేపథ్యంలో అధ్యక్షునిగా రవీందర్, ప్రధాన కార్యదర్శిగా వై.శ్రీనివాస్ చౌదరి, ఉపాధ్యక్షులుగా టి.శుక్లా చారి, పి.అవినాష్‌కుమార్, కె.సత్యం చారి, కోశాధికారులుగా యు.శ్రీనివాస్ చారి, ఎస్ఆర్‌ప్రసాద్, సంయుక్త కార్యదర్శులుగా ఎం.అనిల్‌రెడ్డి, వి.ఉపేందర్ రెడ్డి, పురుషోత్తం, పి.జంగయ్యగౌడ్, ఆర్.నరేష్‌చారి, షాజునాయక్, ముఖ్య సలహాదారులుగా నర్సింహులు, శ్రీనివాస్‌గౌడ్, రాజిరెడ్డి, జబ్బర్‌లాల్, సైదులు కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.

## తెలంగాణ ఎఐపిఎంఎం అధ్యక్షుడిగా ఖమర్


సమావేశంలో పాల్గొన్న అద్నాన్ ఖమర్, హనీఫ్, యూసుఫ్ తదితరులు

**మలక్‌పేట, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:** ఆల్‌ఇండియా పస్మాండ ముస్లీం మహాజ్ (ఎఐపిఎంఎం) తెలంగాణ అధ్యక్షుడిగా, ఇంఛార్జిగా న్యాయ విద్యార్థి అద్నాన్ ఖమర్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఐపిఎంఎం తనకు అప్పగించిన అపారమైన బాధ్యతలను నెరవేరుస్తామని పేర్కొన్నారు. తెలంగాణలోని పస్మాండ ముస్లీంలు షెడ్యూల్డ్ కులాలు, తెగలకంటే వెనుకబడి ఉన్న అత్యంత అణగారిన వర్గాలని అన్నారు. సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా వెనుకబడిన పస్మాండ వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వాలు, పార్టీలు, ప్రజా సంఘాలు ముందుకు సహకరించాలన్నారు. అనంతరం ఆయనను పలువురు నాయకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎఐపిఎంఎం జాతీయ అధ్యక్షుడు పర్వేజ్ హనీఫ్, మహ్మద్ యూసుఫ్, ప్రొఫెసర్ మసూద్ ఆలం ఫలహి, ఫయాజ్ అహ్మద్ ఫయాజీ, అక్తర్, యుపి రాష్ట్ర మంత్రి దానిష్ ఆజాద్ అన్సారి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌టీపీ పనులను త్వరితగతిన ప్రారంభించండి : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ శాంతి శేఖర్

**నాచారం, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:** నాచారం హెచ్ఎంటీ పెద్ద చెరువు కట్ట వద్ద నిర్మిస్తున్న ఎస్‌టీపీ పనులను త్వరితగతిన ప్రారంభించి ప్రజలకు ఉపయోగపడే విధంగా చూడాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అధికారులకు ఆదేశించారు. ఈ మేరకు ఆయన సంబంధిత అధికారులు, కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్‌తో కలిసి రూ. 32 కోట్ల వ్యయంతో చేపడుతున్న ఎస్‌టీపీ పనులను పర్యవేక్షించారు. ఎస్‌టీపీ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. 27.5ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన మురుగునీటి శుద్ధి పనులను ప్రారంభిస్తే కలుషితనీరు, మురుగునీరు శుద్ధి అవుతుందని ఎమ్మెల్యే అధికారులకు చెప్పారు. ఈ కార్యక్రమంలో జలమండలి జీఎం సుబ్రహ్మణ్యం, డిజీఎం నాగేశ్వర్‌రావు, హెచ్ఎంటీ, సరస్వతీ కాలనీ సభ్యులు పాల్గొన్నారు.

## కోమటికుంట, పోచమ్మకుంట సుందరీకరణ పనులపై విచారణ చేయిస్తా: కెఎల్ఆర్


సుందరీకరణ పనుల్లో అవినీతిపై కెఎల్ఆర్‌కు వివరిస్తున్న నవారు మల్లారెడ్డి

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడ కోమటికుంట, పోచమ్మకుంట సుందరీకరణ పనులపై విచారణ చేయిస్తానని నియోజకవర్గ కాంగ్రెస్ ఇంఛార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా కోమటికుంట, పోచమ్మకుంట సుందరీకరణ పనులను ఆయన కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. కాంగ్రెస్ నాయకులు నవారు మల్లారెడ్డి, బోయపల్లి వెంకట్‌రెడ్డి తదితరులు సుందరీకరణ పనుల్లో జరిగిన అవినీతిని కెఎల్ఆర్‌కు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సుందరీకరణ పనుల అవినీతిపై విచారణ చేయించి బాధ్యులపై ప్రభుత్వం చర్యలు తీసుకునే విధంగా చూస్తామన్నారు. ప్రభుత్వ భూముల కబ్జా భాగోతాలను వెలికి తీస్తామని ఆయన స్పష్టం చేశారు. అదే విధంగా అక్రమణలకు గురైన పార్కు స్థలాలను గుర్తించి వాటికి ప్రహరీలను నిర్మించి సంబంధిత కాలనీ సంఘాలకు అప్పగిస్తామని కెఎల్ఆర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామిడి కృష్ణారెడ్డి, దిండు శ్రీనివాస్‌గౌడ్, ఓబి రెడ్డి, రవికాంత్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదల గుడిసెలు ఉన్న స్థలంలోనే పట్టాలు ఇవ్వాలి : మోతిలాల్ నాయక్


సమావేశంలో మాట్లాడుతున్న మోతిలాల్ నాయక్

**సైదాబాద్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:** సైదాబాద్ మండల పరిధిలోని సింగరేణి కాలనీలో గత 3 దశాబ్దాలుగా గుడిసెల్లో ఉంటున్న నిరుపేదలకు గుడిసెలు ఉన్న స్థలంలోనే ఇండ్ల పట్టాలు మంజూరు చేయాలని సేవాలాల్ బంజారా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కొర్ర మోతిలాల్ నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. సింగరేణి కాలనీలోని అర్బన్ సీలింగ్ ప్రభుత్వ స్థలంలో గత 30 సంవత్సరాలకు పైగా గుడిసెల్లో ఉంటున్న నిరుపేదలను ఇక్కడి నుంచి వెళ్లగొట్టడానికి కొంత మంది సొసైటీ పేరుతో కుట్ర చేస్తున్నారని అన్నారు. సొసైటీ పేరుతో కొంత మంది తప్పుడు సమాచారం చెబుతూ రాష్ట్ర ప్రభుత్వాన్ని, అధికారులను తప్పు దోవపట్టించడానికి ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు. గుడిసెవాసులందరు ఐక్యంగా కుట్రలను ఎదుర్కోవాలన్నారు. గత 30 సంవత్సరాలుగా ఇక్కడే ఉంటున్న తమకు రేషన్ కార్డు, ఓటరు కార్డులు ఉన్నాయని మోతిలాల్ పేర్కొన్నారు. గుడిసెలు ఉన్నచోటే ఇండ్ల పట్టాలు ఇవ్వాలని కోరుతూ త్వరలోనే రెండు వేల మంది గుడిసెవాసులు తమ కుటుంబ సభ్యులతో కలిసి ప్రజావాణిలో ప్రభుత్వానికి వినతిపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తుకారాం, విక్రమ్, సక్రి భాయి, ఏలూరు బాబు, షేక్ మహబూబ్, బస్సీనాయక్, రవీందర్ నాయక్, సద్దాంఖాన్, రవినాయక్, విజయ్, అంజయ్య, చందు, శాంతి భాయి తదితరులు పాల్గొన్నారు.

## కనీస సదుపాయాలు కల్పించి సమస్యలు లేకుండా చూస్తాం : కళ్లెం నవజీవన్‌రెడ్డి

**హయత్‌నగర్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:** కాలనీల్లో కనీస సదుపాయాలు కల్పించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తానని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని సాయికాలనీ ఫేజ్–2లో నూతనంగా ఏర్పాటు చేస్తున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీవాసులను అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని తెలిపారు. సమస్యలు ఏవైనా తన దృష్టికి తీసుకురావచ్చునన్నారు. అనంతరం అధికారులతోకలిసి ఆర్టీసీ మజ్దూర్ కాలనీలో పర్యటించి సీసీరోడ్డు నిర్మాణ పనులను పర్యవేక్షించారు. రోడ్లపై నీరు నిలువకుండా జాగ్రత్త పడాలన్నారు. నాణ్యతపై రాజీపడితే ఊరుకునే ప్రసక్తి లేదన్నారు. కాలనీలో మిగిలిపోయిన రోడ్లను సైతం త్వరలోనే పూర్తిచేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఏఈ సురేష్, కాలనీ ప్రతినిధులు సూర్య, నర్సింహాచారి పాల్గొన్నారు.

## నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు: మేయర్


నీటి సరఫరాను ప్రారంభించి బిందెలో మంచినీటిని అందిస్తున్న పారిజాత

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఈ వేసవిలో నీటి ఎద్దడి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. కార్పొరేషన్‌లోని 18వ డివిజన్ శ్రీ బాలాజీ టౌన్‌షిప్ కాలనీలో బుధవారం ఆమె మంచి నీటి సరఫరాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్పొరేషన్‌లోని ఏ డివిజన్‌లో కూడా నీటి సమస్యలు లేకుండా చూస్తామని స్పష్టం చేశారు. ప్రజలు నీటి వృధాను అరికట్టాలని మేయర్ సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కౌన్సిల్ కాంగ్రెస్ పక్ష నాయకుడు వంగేటి ప్రభాకర్ రెడ్డి, కార్పొరేటర్లు బండారి మనోహర్, నేనావత్ బాలు నాయక్, నాయకులు ఎర్ర జైహింద్, పన్నాల రాజేందర్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం నాయకులు, స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.

## క్షమాపణలు చెప్పకుంటే బాల్క సుమన్‌ను రాష్ట్రంలో తిరగనివ్వం: మధుసూదన్‌రావు


ఏసీపీకి వినతిపత్రం అందజేస్తున్న మధుసూదన్‌రావు, ఉపేందర్‌రెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:** సిఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బాల్క సుమన్ వెంటనే క్షమాపణ చెప్పాలని లేకుంటే రాష్ట్రంలో తిరగనివ్వమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ బండి మధుసూదన్‌రావు హెచ్చరించారు. బాల్క సుమన్‌పై చర్యలు తీసుకోవాలని ఎల్బీనగర్ ఏసిపి జానకిరెడ్డికి మధుసూదన్‌రావు, ఆలేటి కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు బాల్క సుమన్ చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకే ఇలాంటి పనికి మాలిన ఆరోపణ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చెన్నూరు నియోజకవర్గంలో ప్రజలు బాల్క సుమన్‌కు బుద్ధి చెప్పిన సిగ్గు రాలేదన్నారు. పదేళ్ల కాలంలో బిఆర్ఎస్ నాయకులు చేసిన తప్పులకు బాల్కసుమన్, కేటీఆర్‌లు ముక్కు నేలకు రాయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యువజన రాష్ట్ర నాయకులు చిలక ఉపేందర్‌రెడ్డి, పున్న గణేష్, జ్ఞానేశ్వర్‌యాదవ్, రమేష్, శివ, రాజునాయక్, నబి, సలీం, ప్రేమ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా లక్ష్మారెడ్డి


లక్ష్మారెడ్డికి నియామక పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

**హయత్‌నగర్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:** పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీకి చెందిన మజ్జిగ లక్ష్మారెడ్డిని కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. ఈమేరకు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి బుధవార ఆయనకు ఉత్తర్వుల కు సంబంధించిన పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పార్టీ అభివృద్ధికి పాటుపడతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులకు అందేలా చూడాలన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉంటూ ప్రజాసమస్యలను పార్టీ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. లక్ష్మారెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నెరవేర్చి పార్టీకి, ప్రభుత్వానికి పేరు తీసుకువస్తానని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ కమిటీ అధ్యక్షుడు కొత్తపల్లి జైపాల్‌రెడ్డి, నాయకులు విజయశేఖర్‌రెడ్డి, పసుల రాజేందర్, పండుగల రాజు, గంట లక్ష్మారెడ్డి, గంట శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## లక్ష్మినగర్‌లో థీమ్ పార్కు ప్రారంభం



థీమ్ పార్కును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్, కార్పొరేటర్ శ్వేత

**సైదాబాద్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:** ఐఎస్ సదన్ డివిజన్ లక్ష్మినగర్ కాలనీలో రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించిన థీమ్ పార్కును యాకుత్‌పుర ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మెరాజ్ బుధవారం కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధికి తన పూర్తి సహకారం అందిస్తానని అన్నారు. కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి మాట్లాడుతూ థీమ్ పార్కు ప్రజలకు ఆహ్లాదాన్ని కలిగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డిసి నాగమణి, లక్ష్మినగర్ కాలనీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రవీందర్‌రెడ్డి, బాలకృష్ణగౌడ్, ప్రపుల్ల కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సవాల కమిటీ చైర్మన్‌గా బాబురాజు


బాబురాజును సన్మానిస్తున్న చౌకి రవికుమార్ తదితరులు

**మలక్‌పేట, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:** బిఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రాం జయంతి ఉత్సవాల కమిటీ ఓల్డ్ మలక్‌పేట చైర్మన్‌గా బాబురాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఓల్డ్ మలక్‌పేట సాయిగణేష్‌భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బాబు రాజు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అంబేద్కర్, జగ్జీవన్‌రాం జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం చౌకి రవికుమార్ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బాబు శ్రీనివాస్, వేముల విజయ్‌కుమార్, శ్రీకాంత్‌గౌడ్, చౌకి రాజు, చీపురు రాజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆటో, ట్రాక్టర్ డ్రైవర్లు పోలీసుల సూచనలు పాటించాలి : ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**సైదాబాద్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:** ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ఆటో డ్రైవర్లు, ట్రాక్టర్ అసోసియేషన్ సభ్యులు అధికారుల సూచనలు పాటించాలని ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బిఎన్ రెడ్డి నగర్ నుంచి, ఎల్‌బినగర్ నుంచి ఐఎస్‌సదన్ చౌరస్తావరకు నడిచే ఆటోలను ఆర్‌టిసి కాలనీ వరకే ట్రాఫిక్ పోలీసులు అనుమతిస్తుండడం, ట్రాక్టర్లను ఉదయం 11.30 నుంచి సాయంత్రం4.30వరకే అనుమతిస్తుండడంతో ఆటో డ్రైవర్స్ యూనియన్, ట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు, ట్రాఫిక్ అధికారులతో కలిసి బుధవారం కర్మన్‌ఘాట్‌లో ఎమ్మెల్యే సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు ఆటో, ట్రాక్టర్ డ్రైవర్లు మాట్లాడుతూ ఆటోలను ఐఎస్ సదన్‌చౌరస్తా వరకు అనుమతించాలని, ట్రాక్టర్లను అనుమతించాలని, నో ఎంట్రీ విధానం ఎత్తివేయాలని కోరారు. అనంతరం ట్రాఫిక్ అధికారులు మాట్లాడుతూ ఆటోలు ఒకదాని వెనుక ఒకటి సీరియల్‌గా పెట్టుకోవాలని, ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించవద్దని, యూనిఫామ్ ధరించాలని, రాంగ్ రూట్లో వెళ్లవద్దని, మద్యం సేవించి వాహనాలు నడుపవద్దని సూచించారు. ఆటో, ట్రాక్టర్ డ్రైవర్లు తెలిపిన సమస్యలను తమపై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి తప్పకుండా న్యాయం చేస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ పోలీసుల సూచనలు పాటిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ఆటోలు నడుపుకోవాలన్నారు. రోజు రోజుకి పెరుగుతున్న కాలుష్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఎలక్ట్రిక్ వాహనాలపై దృష్టి కేటాయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌బినగర్, సంతోష్‌నగర్ ట్రాఫిక్ ఏసిపిలు నవీన్‌రెడ్డి, సత్యనారాయణ, సిఐలు నర్సింగ్‌రావు, నర్సింహానాయక్, లింగోజిగూడ డివిజన్ మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ పనులు పూర్తి చేయాలి : శ్రీవాణి


జడ్‌సి పంకజకు వినతిపత్రం అందజేస్తున్న శ్రీవాణిఅంజన్‌కుమార్

**హైదరాబాద్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:** డివిజన్లో పేరుకు పోయిన పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. ప్రజావాణి కార్యక్రమంలో ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ పంకజను కలిసి డివిజన్లోని పలు సమస్యలను వివరించారు. అంబేద్కర్‌నగర్, భగత్‌సింగ్‌నగర్, విజయపురికాలనీ, లక్ష్మీనగర్, ఎస్బిఐకాలనీ పెండింగ్ పనులు. పోచమ్మబాగ్, వెంకటేశ్వరకాలనీ, కృష్ణానగర్, క్రాంతినగర్, శంకర్‌నగర్ కొత్త రోడ్ మంజూరి పనులు, శంకర్‌నగర్, భగత్‌సింగ్‌నగర్, లక్ష్మీనగర్ పెండింగ్‌లో ఉన్న కమ్యూనిటీహాల్లు, విజయపురికాలనీలలో నాలా పనులు, అక్రమపార్కింగ్, శానిటైజేషన్ విభాగం ఫిర్యాదులను, జలమండలికి సంబంధించిన అనేక సమస్యలపై జోనల్ కమిషనర్‌కు కార్పొరేటర్ వినతి పత్రాన్ని అందజేశారు. తక్షణమే ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఆమె కోరారు.

## నాదర్‌గుల్‌లో అభయాంజనేయ ఆలయ గోపుర నిర్మాణానికి శ్రీకారం

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ కార్పొరేషన్ నాదర్‌గుల్ గ్రామంలో గ్రామస్తులు, దాతల సహాయ సహకారాలతో శతాబ్దాలైనా చెక్కు చెదరని విధంగా పూర్తిగా శిలలతో (రాతితో) శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయాన్ని పునర్నిస్తున్నామని దేవస్థాన కమిటీ ఛైర్మన్ మ ర్రి నర్సింహారెడ్డి తెలిపారు. నిర్మాణంలో ఉన్న ఆలయానికి ప్రధానమైన గోపుర నిర్మాణానికి బుధవారం ఆయన ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులతో కలిసి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆగమ పండితుల సూచనల మేరకు భవ్యమైన ఆలయాన్ని పునర్నిర్మిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో భాగ్యనగర్ సొసైటీ ఛైర్మన్ మర్రి నర్సింహారెడ్డి, మర్రి హన మ్మంత్‌రెడ్డి, కందాడి శ్రీరాంరెడ్డి, మర్రి జగన్ మోహన్‌రెడ్డి, అంకంగారి కుమార్‌గౌడ్, తోట శ్రీధర్‌రెడ్డి, చమన్ బిక్షపతిగౌడ్, నిమ్మల శ్రీకాంత్‌గౌడ్, దండు యాదయ్య, సుధాకర్ యాదవ్, జెనిగె మల్లేష్ యాదవ్, పెత్తుల్ల ఆనంద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కురుమనగర్‌లో రేషన్‌షాపు ప్రారంభం : రజితరెడ్డి

**ఉప్పల్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త :** ఉప్పల్ డివిజన్ కురుమనగర్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన రేషన్‌షాపును కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ఎం.రజితరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కురుమనగర్‌లో రేషన్‌షాపు ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. సర్దుబాటులో భాగంగా రేషన్ దుకాణం ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. డివిజన్‌లోని అన్ని కాలనీల లబ్దిదారులకు ఇబ్బంది లేకుండా రేషన్‌షాపులు ఏర్పాటు చేసేందుకు కృషి చేసినట్లు తెలిపారు. కాలనీవాసులకు మౌళిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా ముందుకు సాగుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ నేతలు నవీన్‌యాదవ్, గోవింద్‌కుమార్, కుమారస్వామి, ఎం.రాఘవేందర్, హనుమంతు, రాంచందర్, సుధాకర్, సత్యనారాయణచారి, యాదగిరి, సతీష్, రవీందర్, రవి, శివ తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యత ప్రమాణాలు పాటించాలి : పవన్


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

**హైదరాబాద్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:** అభివృద్ధి పనుల విషయంలో అధికారులు కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలను పాటించాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ సూచించారు. ఆర్టీసీ కాలనీలో కార్పొరేటర్ పర్యటించి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ లైన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైనేజ్‌లైన్ పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని పగిలిన డ్రైనేజ్ పైపులు మరమత్తులు జరిగేలా చూడాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పనులు పూర్తి చేయాలని అన్నారు. రోడ్‌నెంబర్ 3 వాటర్‌లైన్ 100 మీటర్ల వరకు పొడిగించాలని, నివాసస్థులు త్రాగునీరు అందక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కాలనీలో నిర్మిస్తున్న కమ్యూనిటీహాల్ పనులను పరిశీలించారు, ఈ కార్యక్రమంలో ఏఈ రామ కృష్ణారెడ్డి, కాలనీ అధ్యక్షుడు పెంటరెడ్డి, యాదగిరి, లక్ష్మయ్యగౌడ్, శివచారి, కృష్ణారెడ్డి, వర్క్‌ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డిని బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసిన టిఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకుడు, మల్లారెడ్డి హెల్త్ సిటీ చైర్మన్ డాక్టర్ సిహెచ్ భద్రరెడ్డి(ఎల్.బి.నగర్, ప్రభాతవార్త)